నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 10 డిసెంబర్ 2024 | SIDDIPET

చీకటి ఒప్పందాలు బయటపడుతాయని భయం

- గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబర్ 9: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు బయటపడుతాయని భయంతోనే అసెంబ్లీ హాల్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రాకుండా అడ్డుపడ్డారని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ టీషర్టుపై అదానీ, మోదీ ఫొటోలు వేసుకొని పార్లమెంట్ లోపలికి వెళ్తే తప్పులేదు కానీ, తెలంగాణ అసెంబ్లీలో టీ షర్టులపై రేవంత్ రెడ్డి, అదానీ బొమ్మలతో వెళితే తప్పేముందని ప్రశ్నించారు. అదానీతో రేవంత్‌రెడ్డి చేసుకున్న ఒప్పందాలు బయటపెడుతారనే భయంతోనే అసెంబ్లీలోకి రాకుండా అడ్డుపడుతున్నరని, ఇలాంటి చర్యలను తెలంగాణ సమాజం గమనిస్తుందన్నారు. ప్రతిపక్ష నేతలను అడ్డుకునే ముందు దేశంలో కాంగ్రెస్ నేతలు అనుసరిస్తున్న విధానాలను తెలుసుకోవాలని రేవంత్‌రెడ్డికి హితువు పలికారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి కాంగ్రెస్ తల్లిని ప్రతిష్ఠించాలనుకుంటున్న మూర్ఖత్వపు చర్యలను మానుకోవాలన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ప్రజలకిచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదన్నారు. రైతులకు రూ.2లక్షల పంట రుణమాఫీ, మహిళలకు రూ.2500, స్కూటీల పంపిణీ, వృద్ధులకు పింఛన్ రూ.4వేలు, రైతుభరోసా రూ.7500 లాంటి పథకాలు ఒక్కటి కూడా అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నదన్నారు. ఏడాది పాలనలో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదని, తిట్ల పురాణం తప్పా చేసింది శూన్యం అన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళాన్ని వినిపించే ఒక్క ఎంపీ కూడా రాష్ట్రం నుంచి లేరన్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవాలని ప్రజలను కోరారు. గడిచిన పదేండ్లలో తెలంగాణ అభివృద్ధి సాధ్యమయిందని, కేసీఆర్ ఆలోచన విధానాలతో రాష్ట్రం అభివృద్ధిలో పయనించిందన్నారు. తెలంగాణ భవిష్యత్ నిర్మాణం కోసం ప్రజలు కేసీఆర్ వెంటే ఉండాలని కోరారు. కేసీఆర్ పదేండ్లలో ప్రాజెక్టు నిర్మాణంతో సాగునీళ్లు అందించి రైతులకు అండగా నిలిచారని, ఆయన ఆనాడు నిర్మించిన ప్రాజెక్టుల ఫలాలతోనే రాష్ట్రంలో పుష్కలంగా ధాన్యం పండుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, నాయకులు కృష్ణారెడ్డి, విరాసత్ అలీ, దేవేందర్, గుంటుక రాజు, పాల రమేష్‌గౌడ్, అహ్మద్, ఉమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి రూపాన్ని మారుస్తారా?

- బతుకమ్మను తీసివేయడం చాలా బాధాకరం
- కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసింది..
- బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు

మాట్లాడుతున్న మహిళా ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మహిళా నాయకులు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 9: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల మండిపడ్డారు. ప్రభుత్వం తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం బాధాకరమన్నారు. సోమవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆశలను అడియాశలు చేసిందన్నారు. కేసీఆర్ చావునోట్లో తలపెట్టి, ఎన్నో పోరాటాలు చేసి సాధించిన తెలంగాణలో తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చి, బతుకమ్మను తీసివేయడం బాధాకరమన్నారు. పదేండ్లలో వైభవంగా బతుకమ్మ పండుగ జరుపుకున్నామని, అలాంటి తెలంగాణ తల్లి చేతిలో నుంచి బతుకమ్మను తీసివేయడం మంచిది కాదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని ఎంతోమంది కవులు, మేధావులు కలిసి రూపొందించారన్నారు. ఎవరైనా తల్లి రూపాన్ని మార్చుకుంటారా.. అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో పథకాలను బంద్ చేశారన్నారు. హైదరాబాద్‌లో ఆశ వర్కర్లపై పోలీసులు దౌర్జన్యం చేశారని, మహిళలపై ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం గౌరవం లేదన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీదేవి, కౌన్సిలర్లు రేణుక, దీప్తి, ఇతర మహిళలు పాల్గొన్నారు.

ప్రజావాణికి 74 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 9: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి కలెక్టర్ 74 అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అర్జీలు పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలన్నారు.

ప్రజావాణిలో వృద్ధురాలి ఆవేదన

ఆస్తితోపాటు డబ్బులు కాజేసిన కొడుకు ఇంటి నుంచి నెట్టేశాడని, ఏమి చేయాలో తెలియక ప్రజావాణికొచ్చి ఫిర్యాదు చేసింది ఓ వృద్ధురాలు. కలెక్టర్‌కు అందించిన ఫిర్యాదు ప్రకారం ఆమె మాటల్లోనే. నా పేరు పట్లోళ్ల అన్నమ్మ. మాది వట్‌పల్లి మండల కేంద్రం, నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా, చిన్న కొడుకు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. మాకు బూసరెడ్డిపల్లిలో 11 ఎకరాల భూమి ఉండగా, ఆ భూమి సింగూర్ ముంపునకు గురైంది. దీంతో ప్రభుత్వం ఇచ్చిన భూమి డబ్బులను బ్యాంకులో జమ చేశాను. అయితే నా పెద్ద కొడుకు ఆ డబ్బులను బ్యాంకు నుంచి డ్రా చేయించి తీసుకున్నాడు. సంగారెడ్డిలోని శిల్పా వెంచర్‌లో రూ.75లక్షల విలువైన ఇల్లు కట్టుకున్నాడు. గ్రామంలోని రూ.50లక్షల విలువైన ఇల్లు తన పేరున చేయించుకున్నాడు. సంగారెడ్డి, వట్‌పల్లిలలో ఉన్న రెండు ఇండ్లు అతడి పేరున ఉన్నాయి. ఇప్పుడు భార్యతో కలిసి నాపై దాడి చేసి, ఇంటి నుంచి గెంటివేశాడు. ఆస్తిని కాజేయడమే కాకుండా, డబ్బులు తీసుకొని వేధింపులకు గురిచేస్తున్న పెద్దకొడుకుపై చర్యలు తీసుకోవాలి.

ఈవీఎంల పరిశీలన

బైపాస్ రోడ్డులోని పాత డీఆర్డీఏ కార్యాలయంలో ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒక సారి ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తామన్నారు. స్ట్రాంగ్ రూమ్ ప్రాంతంలోని భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, సీఈ కెమెరాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

పల్లెవాసికి పన్నుపోటు

పల్లెకు దూరమై.. బతుకు భారమై..

విలీన గ్రామాల ప్రజలపై పన్ను పిడుగు

సొంతింటికి గుదిబండలా మారనున్న ఆస్తి పన్ను

ఖాళీ స్థలాల నుంచి కటింగ్ షాపుల వరకు పన్నులు

అరకొర వసతులు.. అధిక మొత్తంలో పన్నులు

సంగారెడ్డి, (నమస్తే తెలంగాణ)/ పటాన్‌చెరు/అమీన్‌పూర్, డిసెంబర్ 9: చాలీచాలని జీతాలు.. కూలీ నాలీ చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే పేదలకు ఆ పల్లెలే ప్రపంచం. ఇన్నాళ్లు ఉన్నది తిని.. తృప్తిగా బతుకుతున్న పేదోడిని ఆర్థికంగా నలిపేసేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమైంది. గ్రేటర్ చుట్టూ ఔటర్ లోపల విస్తరించి ఉన్న 51 గ్రామాల పల్లెవాసుల జేబులను పన్నులతో కొల్లగొట్టేందుకు సమాయత్తమవుతున్నది. పల్లెలకు దూరమై పురపాలికల్లో చేరుతున్న ప్రజలకు ఆస్తి పన్ను గుదిబండలా మారనున్నది. పొట్ట కూటి కోసం పెట్టుకునే కిల్లీ కొట్టు నుంచి కిరాణ దుకాణం వరకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరికానున్నాయి. మున్సిపాలిటీల్లోకి మారిన తర్వాత ఇంటికే కాదు.. ఇంటి పక్కన ఉండే ఖాళీ స్థలాలకు కూడా పన్నులు వసూలు చేసి రేవంత్ సర్కారు ఖజానా నింపుకోనున్నది.

ఆస్తి పన్ను... మూడింతలు

గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం వల్ల ముందుగా పేదోడిపై ఆస్తి పన్ను భారం పడనున్నది. వీటితో పాటు ట్రేడ్ లైసెన్స్, మున్సిపాలిటీ నల్లా నీళ్లు, వేకెట్ ల్యాండ్ ట్యాక్స్ పేరిట మరిన్ని పన్నుపోటులు పడనున్నాయి. ఒక్కో ఇంటిపై అదనంగా ఏటా పన్నుల రూపంలో రూ. 5వేల నుంచి 10వేల వరకు ప్రభుత్వం ముక్కు పిండి వసూలు చేయనున్నది. గ్రామాల్లో ప్రస్తుతం చదరపు గజానికి ఇంటి విలువలో 0.15 నుంచి 1 శాతం మేర పన్ను వసూలు చేస్తుండగా.. మున్సిపాలిటీల్లో చేరగానే అదే ఇంటికి చదరపు అడుగుకు రూ. 10-50 చొప్పున వసూలు చేస్తారు. 150 గజాల ఇంటికి ఏటా సుమారు రూ. 6వేల నుంచి 8వేలు వరకు ఆస్తి పన్ను చెల్లించాల్సిన దుస్థితి రానున్నది. ఒకవేళ నిర్మాణంలో జరిగే చిన్న చిన్న లోపాలను కూడా పరిగణనలోకి తీసుకుని అనధికారిక నిర్మాణం(యూసీ) ట్యాక్స్ పేరిట ఇంటి పన్ను మొత్తానికి సమానంగా ఏటా పెనాల్టీ విధించనున్నది. అదే గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నిర్మించుకునే కమర్షియల్ బిల్డింగులపై ఇకపై రెండింతల మొత్తంలో ఆస్తి పన్ను చెల్లించాల్సి వస్తే, దానిలో నిర్వహించుకునే దుకాణాలు, షాప్‌లకు అదనంగా రూ.3వేల నుంచి రూ. 50వేల వరకు ట్రేడ్ లైసెన్స్ పేరిట స్థానిక మున్సిపాలిటీలు వసూలు చేయనున్నాయి.

ఖాళీ స్థలాల నుంచి..

గ్రామాల్లో ఖాళీ స్థలాలపై ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ మున్సిపాలిటీల్లో ప్లాట్ ధరలో 0.5-0.8 వరకు పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన 100 గజాల ఖాళీ ఇంటి జాగాపై కనీసం మున్సిపాలిటీల్లో రూ. 480-1015 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో ఇంటిపై ఏడాదికి కనీసం రూ. 5వేల నుంచి రూ. 10వేల పన్ను భారం పడనున్నది. గ్రామాల్లో ఉపాధి నిమిత్తం నిర్వహించుకునే హెయిర్ కటింగ్, ఇస్త్రీ దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లో కొన్ని మినహాయింపులు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో ఎవరికీ మినహాయింపుల్లేవు.

పటాన్‌చెరు

పల్లె సొలతులు... బల్దియా పన్నులు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇన్నాళ్లు గ్రామాల్లో ఉన్న సొలతులకు తగినట్టుగానే పన్నులు చెల్లిస్తూ వచ్చారు. ఇప్పుడు పల్లెలు, తండాలు, హామ్లెట్ విలేజీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం వల్ల పల్లె వసతులకే.. టౌన్ తరహా ట్యాక్సులు అదనంగా చెల్లించాల్సి రానున్నది. మున్సిపాలిటీల్లో మారగానే ఒక్కసారి మౌలిక వసతులు అభివృద్ధి చేసే వీలు లేదు. కానీ పల్లె జనాల నుంచి పన్నుల రూపంలో భారీ మొత్తంలో వసూలు చేసి కాంగ్రెస్ సర్కార్ ఖజానా నింపుకొనున్నది. ఇలా పల్లెకు దూరమై మున్సిపాలిటీల్లో కలుస్తున్న గ్రామీణవాసులపై కాంగ్రెస్ ప్రభుత్వం పన్నుపోటు పొడవనున్నది.

150 గజాల ఇంటిపై పడే పన్ను

ప్లాట్ ఏరియా 150 గజాలు (రెసిడెన్షియల్)

	గ్రామాలు	మున్సిపాలిటీలు
ఇంటి పన్ను	2273	6336
లైబ్రరీ సెస్	182	0
డ్రైనేజీ	0	0
లైటింగ్	0	0
వాటర్	0	0
ఎల్‌సీఎస్	0	254
మొత్తం	2455	6590

200 గజాల్లో నిర్మించిన షాప్‌పై పడే పన్ను

ప్లాట్ ఏరియా 250 గజాలు (కమర్షియల్ ప్రాపర్టీ)

	గ్రామాలు	మున్సిపాలిటీలు
ఇంటి పన్ను	4388	9240
లైబ్రరీ సెస్	351	0
డ్రైనేజీ	0	0
లైటింగ్	0	0
వాటర్	0	0
ఎల్‌సీఎస్	0	370
మొత్తం రూ.	4739	9610

మున్సిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్ పన్నులు...

- చదరపు అడుగుకు రూ. 3.00 (సింగిల్ రోడ్డు)
- చదరపు అడుగుకు రూ. 4.00 (డబుల్ రోడ్డు)
- 1000 చదరపు అడుగుల్లో ఉండే షాప్‌పై చదరపు అడుగుకు (సింగిల్ రోడ్డు) రూ. 3వేల నుంచి రూ.10వేల లోపు
- చదరపు అడుగుకు (డబుల్ రోడ్డు) రూ. 4వేల నుంచి రూ.50వేల లోపు

గ్రామాల్లో పన్నుల శాతం

- ప్రాపర్టీ ట్యాక్స్ 0.15% నుంచి 1 శాతం
- లైబ్రరీ సెస్ 8 శాతం
- ఇంటి పన్నుపై డ్రైనేజీ ట్యాక్స్ 0
- లైటింగ్ ట్యాక్స్ 0
- వాటర్ ట్యాక్స్ 0

గ్రామాల్లో ట్రేడ్ లైసెన్స్ చార్జీలు

షాప్‌లపై...

షాప్ రూ.900-1500

రింగు రోడ్డు ఉన్న గ్రామాలు...

రింగు రోడ్డు ఉన్న గ్రామాలను ప్రభుత్వం దగ్గరలోని మున్సిపాలిటీల్లో విలీనం చేసింది. పంచాయతీలను ఈ ఏడాది ఫిబ్రవరి తొలివారంలోనే రద్దు చేశారు. అనంతరం ప్రత్యేక అధికారుల పాలనను అమల్లోకి తెచ్చారు. రాష్ట్ర, జిల్లా అధికారుల సూచనల మేరకు ఆగస్టులో ప్రత్యేక అధికారులు తూతూమంత్రంగా గ్రామ సభలు పెట్టి పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తున్నామని తీర్మానాలు చేశారు. సభలకు వచ్చిన ప్రజలు తమకు మున్సిపాలిటీల్లో ఉండడం ఇష్టం లేదని స్పష్టం చేసినా అధికారులు పట్టించుకోకుండా రికార్డులు తయారు చేశారు. దీంతో సెప్టెంబర్ 3న పటాన్‌చెరు మండలంలోని ఐదు గ్రామాలు ముత్తంగి, పోచారం, కర్ధనూర్, పాటి, ఘనపూర్, అమీన్‌పూర్ మండలంలోని ఆరు గ్రామాలు ఐలాపూర్, ఐలాపూర్ తండా, కృష్ణారెడ్డిపేట్, పటేల్‌గూడ, దాయర, సుల్తాన్‌పూర్‌లను తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తున్నట్టు ప్రభుత్వం గెజిట్ వెలువర్చింది. దీంతో ఈ గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల్లో ఆందోళనలు ప్రారంభమయ్యాయి. సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు చెబితే తక్షణం పూర్తయ్యే పనుల కోసం ఇప్పుడు తెల్లాపూర్, అమీన్‌పూర్‌లకు వెళ్లడం వ్యయప్రయాసలతో కూడిన విషయంగా మారింది. కార్యదర్శులకు చెప్పినా పరిష్కారమయ్యే సమస్యలను సైతం మున్సిపల్ అధికారులకు చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ పాలనలో అన్ని పనులకు ప్రత్యేక శాఖ, అధికారులుండటంతో గ్రామీణ ప్రజలకు వారి సేవలు పొందటం కష్టతరంగా మారుతున్నది. అంతకంటే ప్రజల్లో భయం మున్సిపాలిటీ పన్నుల వ్యవహారంలో నెలకొన్నది. పంచాయతీల్లో పన్నులు తక్కువగా ఉండేవి. మున్సిపాలిటీల్లో పన్నుల వడ్డింపు దాదాపు రెట్టింపు ఉంటుందని ప్రజల్లో ఆందోళన నెలకొంది.

పన్నులు ఎక్కువ ఉంటాయి..

వ్యవసాయాధారిత గ్రామాలు మావి. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు పన్నులు తక్కువ ఉండేవి. ఒక ఏడాది పంటలు పండకపోతే పంచాయతీలు పన్నుల వసూళ్లపై బలవంతం చేసేవి కావు. ప్రజలు డబ్బులున్నప్పుడే పన్నులు చెల్లించేవారు. పాలకమండళ్లు కూడా పూర్తిగా పేదలుంటే వారిని అసలే అడిగేవారు కాదు. ఇస్తేనే తీసుకునేవారు. ఇప్పుడు మున్సిపాలిటీల్లో గ్రామాన్ని విలీనం చేశారు. మున్సిపాలిటీ అధికారులు ఇస్తున్న సేవలకంటే పన్నుల వసూళ్లే అధికంగా ఉంటాయి. మున్సిపాలిటీ అధికారులు పన్నులు కచ్చితంగా చెల్లించాలని బలవంతం చేస్తారు. కరెంటు కట్ చేస్తారు. నీళ్లు నిలిపివేస్తారు. అది పన్నుల వసూళ్లకే పరిమితం. ఆ తరువాత వారి సేవలు పొందటం అంత సులువు కాదు. కర్ధనూర్ గ్రామస్తుల తరపున మేం పంచాయతీల్లోనే ఉండాలని తీర్మానం చేసి చెప్పాం. కానీ అధికారులు రిపోర్టులో అది పెట్టలేదు.

– డి.రాంప్రసాద్, కర్ధనూర్

కర్ధనూర్ నుంచి తెల్లాపూర్ వెళ్లలేం

తెల్లాపూర్ మున్సిపాలిటీకి పోవడం అంటే అంతఈజీ కాదు. కర్ధనూర్ నుంచి పటాన్‌చెరు వెళ్లాలి, అక్కడి నుంచి లింగంపల్లి చౌరస్తా వెళ్లాలి. లింగంపల్లి నుంచి తెల్లాపూర్ మున్సిపాలిటీకి చేరుకోవాలి. డబ్బులున్న వారికే ఇది సాధ్యం. లింగంపల్లి నుంచి తెల్లాపూర్‌కు రెండోందలు అడుతున్నారు. గరీబోళ్లు వెళ్లగలుగుతారా.? పటాన్‌చెరు పట్టణం అంటే దగ్గర ఉండేది. మండల కేంద్రం కూడాను. ఎలాగు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగవని చెబుతున్నారు. మళ్లీ తీసుకెళ్లి జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తారు. అదేదో నేరుగా పటాన్‌చెరు డివిజన్‌లో కలిపితే మాకు దగ్గరయ్యేది. ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయోగంతో ప్రజలకు నష్టమే. ఇంటి పన్నులు భారీగా విధిస్తారని తెలుస్తున్నది. తెల్లాపూర్ అంటే ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఉంటున్నారు. హైటెక్ ఏరియా కాబట్టి ఎంత పన్ను వేసినా చెల్లిస్తారు. కర్ధనూర్‌లో అవే పన్నులు వేస్తే ప్రజలు కట్టలేరు.

– లక్ష్మణ్, కర్ధనూర్

స్పెషల్ పాలనతో మోసం చేశారు

అధికారుల పాలనలో మోసం జరిగింది. గ్రామ సభలో మున్సిపాలిటీ విలీనంపై మాట్లాడితే ప్రజలు వ్యతిరేకించారు. అయిననూ అధికారులు కర్ధనూర్‌ను తెల్లాపూర్ మున్సిపాలిటీలో కలిపారు. చిన్న గ్రామ పంచాయతీ ఇది. ఒకప్పుడు జాతీయ నిర్మల్ పురస్కారం పొందిన గ్రామం మాది. సంపూర్ణ పారిశుధ్యంలో, అన్ని రంగాల అభివృద్ధిలో గ్రామానికి ఎన్నో అవార్డులు వచ్చాయి. ప్రజలు కూడా పంచాయతీ పాలనలో చక్కగా చింత లేకుండా ఉన్నాం. ఇప్పుడు మున్సిపాలిటీలో కలపడం వల్ల మా గ్రామం పారిశుధ్యంలో వెనుకబడుతుంది. మున్సిపల్ అధికారులు గ్రామానికి ఇచ్చే సేవలు కూడా తక్కువే. పన్నులు మాత్రం భారీగా విధిస్తారు. మేం ఆ స్థాయి టాక్స్‌లు కట్టలేం. మాకు గ్రామ పంచాయతీలోనే ఉండాలని ఉంది.

– ఎల్వర్తి మల్లికార్జున్, కర్ధనూర్

మున్సిపాలిటీలో కలపొద్దన్నాం..

కర్ధనూర్‌ను తెల్లాపూర్ మున్సిపాలిటీల కలపొద్దని మీటింగ్ల సార్లకు, మేడంలకు కోరినం. కానీ వాళ్లు వినలే. బలవంతంగా మున్సిపాలిటీల కలిపిండ్రు. ఇప్పటిదాక నీళ్లు రాకున్నా, మురుగు శుభ్రం చేయకున్నా పంచాయతీల వచ్చి చెప్తే వెంటనే నీళ్లు వదిలేది. మురికి శుభ్రం చేసేటోళ్లు. పన్ను ఇవ్వకున్నా ఏమి అనెటోళ్లు కాదు. సర్పంచ్‌లు, మెంబర్లు సార్లకు చెప్పి ఆపేటోళ్లు. ఇప్పుడు టాక్స్‌లు డబుల్ అవుతాయని చెబుతుండ్రు. అంత పెరిగితే ఎట్ల కడుతాం. మాకైతే కర్ధనూర్‌ను అప్పట్లాగే పంచాయతీగా ఉంచాలని ఉంది. సార్లు ఆ న్యాయం చేయాలే.

– ఎం.బాలయ్య, కర్ధనూర్

నాణ్యమైన సేవలు అందిస్తాం

టాక్స్‌ల విధింపు సాధారణంగానే ఉంటుంది. కొత్తగా గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఆయా గ్రామాల పాత టాక్స్‌ల విధానాన్నే అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకు పాత టాక్స్‌లే ఉంటాయి. ప్రభుత్వ పాలసీలను, నిబంధనలను అమలు చేయడం మా బాధ్యత. పంచాయతీల కంటే మున్సిపాలిటీల్లో సేవలు నాణ్యతతో ఉంటాయి. అన్ని శాఖల అధికారులు ప్రజాసమస్యలను పరిష్కరిస్తారు. గ్రామాల్లో మున్సిపాలిటీ సేవలు వార్డు కార్యాలయాల్లో పొందేలా చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లోనూ టాక్స్‌లు కట్టే వెసులుబాటు కల్పిస్తాం. పౌరసేవల జాబితాను ప్రదర్శిస్తాం. అధికారుల ఫోన్ నెంబర్లు ప్రజలకు కనిపించేలా పెడతాం. సమస్యలు వస్తే తక్షణం స్పందించి పరిష్కరించేలా చూస్తాం.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

రసాభసగా ఇందిరమ్మ కమిటీ సమావేశం

దుబ్బాకలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం

దుబ్బాక, డిసెంబర్ 9: దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఇందిరమ్మ కమిటీ సమావేశం రసాభసగా మారింది. సొంత స్థలం ఉన్న పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా సోమవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితా భూంరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో.. పలువురు కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం చూపారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులే కాకుండా మరికొందరు కాంగ్రెస్ నాయకులు పార్టీ కండువాలతో సమావేశానికి రావడంపై కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశ మందిరంలో కౌన్సిలర్లు కూర్చునేందుకు కనీసం కుర్చీలు లేకుండా కాంగ్రెస్ నాయకులు రావడంపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు కమిషనర్‌ను ప్రశ్నించారు. దుబ్బాకలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. దీంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు, కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. దీంతో అర్ధంతరంగా సమావేశాన్ని ముగించారు. ఇందిరమ్మ కమిటీ సమావేశం నిర్వహణ రసాభసగా మారడానికి మున్సిపల్ అధికారుల సమన్వయ లోపమే కారణమని బీఆర్ఎస్ కౌన్సిలర్లు మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ సమావేశం కాదు: మున్సిపల్ చైర్‌పర్సన్

సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీ సమావేశంలో విధివిధానాలు పాటించకుండా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం హాస్యాస్పదమని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఇందిరమ్మ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కండువాలతో వచ్చి, గొడవకు దిగారని వివరించారు. ప్రజాపాలన అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటాలు చేస్తుంటే.. మరోపక్క ఆ పార్టీ నాయకులే పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీలో కౌన్సిలర్, వార్డు అధికారితో పాటు కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు సభ్యులను చేర్చడాన్ని తప్పుపట్టారు. ఇందిరమ్మ కమిటీ సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ సమావేశంగా కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత నెలకొందని, కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలోనే కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ సుగుణాబాలకిషన్, కౌన్సిలర్లు లలిత, మీన, సులోచన, శ్రీనివాస్, స్వామి ఉన్నారు.

దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో రసాభసగా మారిన ఇందిరమ్మ కమిటీ సమావేశంలో వా